సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 28 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి. 591 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



యువత చేతుల్లోనే దేశ భవిత

యువత చేతుల్లోనే దేశ భవిత ఉందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

35.6°/21.8°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'



సచివాలయ ఉద్యోగితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సోమందేపల్లి: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్ బాబు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని వెలుగు మాకులపల్లి గ్రామంలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని అవసరమైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలు ఏదైనా పథకం అందలేదన్నా, ఏదైనా ధ్రువీకరణపత్రం కావాలన్నా తొలుత టోకెన్లు నమోదు చేయాలన్నారు. అనంతరం సచివాలయాల్లో సర్వీసెస్ రిక్వెస్ట్ రూపంలో జనరేట్ చేయాలని ఆదేశించారు. ఆధార్ నమోదు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి అర్జీలు వస్తే వాటిని అక్కడికక్కడే జారీ చేయాలని ఆదేశించారు. మండలస్థాయి అధికారులు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్తిక్, డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓ నాగరాజరావు, తహసీల్దార్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గోవధ నిషేధం




పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఎక్కడైనా గోవధ చేస్తున్నా, పశువులను అక్రమంగా తరలిస్తున్నా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 1977 గోవధ నిషేధ చట్టం, 1960 జంతు హింస నిరోధక చట్టం ప్రకారం రాష్ట్రంలో ఎక్కడైనా గోజాతి పశువులను వధించడం నేరమన్నారు. మతపరమైన కార్యక్రమాల్లో మాంసం కోసం లేగదూడలు, గేదె జాతి లేగదూడలు, ఒంటెలను వధించకూడదన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పరిమితికి మించి పశువులు, గేదెలు వాహనాలలో రవాణా చేయడం నేరమన్నారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఎండీ అమృతరాజ్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ఐటీడీఏ ఏపీఓగా పని చేసిన లలితాబాయిని అనంతపురం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె విధుల్లో చేరకుండా అమృతరాజ్ అడ్డుకోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ కారణంగా ఆయన్ను సస్పెండ్ చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక ఈ- స్టాంపింగే

- శింగనమలలో రైతు సంజీవయ్య (పేరు మార్చడమైనది) పేరుపై రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కొని, ఆయన పొలాన్ని వేరొకరికి విక్రయించినట్లు ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్ తయారు చేశారు. విషయం తెలుసుకున్న రైతు ఆ అగ్రిమెంట్‌లోని సంతకం తనది కాదని అధికారుల వద్ద ఏకరువు పెట్టినా ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరకు కోర్టులో దావా వేశాడు. ఐదు సంవత్సరాల పాటు కోర్టులో విచారణ జరిగిన తర్వాత రైతు సంజీవయ్యకు న్యాయం జరిగింది.



- క్రయవిక్రయాలు పారదర్శకం
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన రిజిస్ట్రేషన్ శాఖ
- మ్యానువల్ విధానంలో స్టాంపుల కొనుగోలు బంద్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు

అనంతపురం టౌన్/హిందూపురం: నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలను అరికట్టి, పారదర్శక విక్రయాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పాత తేదీలతో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కొనుగోలు చేసి వాటి ద్వారా నకిలీ అగ్రిమెంట్లు సృష్టించుకునే విధానానికి పూర్తి స్థాయిలో చెక్ పెట్టినట్లు అయింది. ఇకపై ×ఏ రోజుకారోజు॰ అనే నినాదంతో ఈ-స్టాంపుల విక్రయాలను చేపట్టింది. స్టాంపుల విక్రయాల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ఈ విధానంతో స్టాంపుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావుండదు.

21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 21 (అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికిపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నాన్ జ్యుడీషియల్ ఈ-స్టాంపుల విక్రయాలను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100 స్టాంపుల విక్రయాలను పూర్తిస్థాయిలో బంద్ చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు సైతం ఈ -స్టాంపుల వినియోగంపై దృష్టి పెట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పారదర్శకంగా ఉండే ఈ- స్టాంపుల ద్వారా స్థిరాస్తుల క్రయ విక్రయాలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈ- స్టాంపింగ్ వెండర్లకు లైసెన్సులు

ఈ- స్టాంపుల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వెండర్ల(విక్రయదారుల)తోపాటు కొత్తవారు సైతం ఈ- స్టాంపింగ్ వెండర్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వారికి లైసెన్సులను సైతం అందజేయనున్నారు. ఇప్పటికే అనంతపురం నగరంతో పాటు హిందూపురం, పుట్టపర్తి కేంద్రాల్లో ఈ స్టాంపింగ్ వెండర్లకు లైసెన్సులు మంజూరు చేశారు. పదో తరగతి, ఆ పైన విద్యార్హతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత ఈ-స్టాంపింగ్ వెండర్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలోగా లైసెన్సులు జారీ చేయనున్నారు.

అవకతవకలకు చెక్



నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలు అరికట్టేందుకు ప్రభుత్వం ఈ- స్టాంపింగ్ విధానం ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10కిపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపు విధానం అమల్లో ఉంది. మిగిలిన కార్యాలయాల్లో సైతం ఈ నెలాఖరులోపు ఈ- స్టాంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయా జిల్లా రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశాం. రానున్న రోజుల్లో మ్యానువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో బంద్ అయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు సైతం పారదర్శకంగా ఉండే ఈ-స్టాంపుల కొనుగోలుపై దృష్టి సారించాలి.

– మాధవి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ

భూ పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేయండి

- రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి
- అధికారులకు జేసీ చేతన్ ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: నిరుపేదలకు భూ పంపిణీ చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా అధికారులతో రీ సర్వే, భూ పంపిణీ, మ్యుటేషన్లు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేతన్ మాట్లాడుతూ, భూ పంపిణీకి భూసేకరణ కమిటీ అనుమతి తీసుకొని కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు. అలాగే జిల్లాలో రెండు, మూడో విడతలో 180 గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయన్నారు. గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. చాలా మంది అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని, ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయని అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రీసర్వేకు సంబంధించి చాలా మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. ప్రతి తహసీల్దార్, సర్వేయర్ సమస్యలు లేకుండా సర్వేను విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్లు పంపిన డేటాను ఆర్డీఓలు పరిశీలించి జేసీ లాగిన్‌కు పంపాలన్నారు. అలాగే మ్యుటేషన్లు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కొండయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, రీ సర్వే డీటీ క్రాంతి పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పడదాం

- జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ నేగి



మాట్లాడుతున్న రాజేంద్రకుమార్ నేగి, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: వర్షం రూపంలో కురిసే ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ నేగి అన్నారు. ఇందుకోసం జాతీయ స్థాయిలో చేపట్టిన జల సంరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించిన ఆయన పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, లేపాక్షి, నల్లమాడ, ధర్మవరం, బత్తలపల్లి, చిలమత్తూరు తదితర 8 మండలాల్లోని గ్రామాల్లో జల సంరక్షణ చర్యలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా తవ్విన ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు, కుంటలు పరిశీలించారు. మంగళవారం కలెక్టరేట్‌లో శాస్త్రవేత్త రాఖీ, జాతీయ ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్, కలెక్టర్ అరుణ్ బాబుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ నేగి మాట్లాడుతూ, జలశక్తి అభియాన్ కింద జిల్లాలో చేపట్టిన పనులు సంతృప్తినిచ్చాయన్నారు. ఎక్కడ చూసినా నీటి సవ్వడులు, పంట పొలాలు కనిపించాయన్నారు. పథకాన్ని ఇక్కడి రైతులు బాగా వినియోగించుకున్నారన్నారు. ఆయా గ్రామాల్లో రైతులను ముచ్చటించినప్పుడు వారి ముఖాల్లో సంతృప్తి కనిపించిందన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, ఇంటి అవసరాలకు వినియోగించిన నీటిని భూమిలోకి ఇంకింపజేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, వర్షపు నీటిని సంరక్షిస్తామని, కేంద్ర బృందం ఇచ్చిన సలహాలు సూచనలు తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ఇప్పటి వరకూ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన పనులు, చేపట్టబోయే పనులను ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్ వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి రాజశేఖర రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఈఈ గంగాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, డీఎఫ్‌ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, డీఎల్‌పీఓ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా ఓటరు నమోదు

- తప్పుల్లేని ఓటర్ల జాబితాకు ప్రత్యేక షెడ్యూల్
- సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా నూతన జాబితాకు కసరత్తు
- 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా విడుదల



ఓటరు గుర్తింపు కార్డులను ఓటర్లకు పోస్టు ద్వారా పంపుతున్న ఎన్నికల సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు నూతన ఓటరు జాబితాకు షెడ్యూల్ ప్రకటించారు. ఎన్నికల నాటికి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక షెడ్యూల్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఏడాది పొడవునా ఎన్నికల సిబ్బంది ఓటరు జాబితా తయారీలో నిమగ్నమై ఉంటారు. నూతన ఓటర్లు ఎప్పుడైనా పేరు నమోదు చేసుకోవచ్చు. ఇటీవల రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముకేష్ కుమార్ మీనా రెండు పర్యాయాలు కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితా నూతన షెడ్యూల్‌పై చర్చించారు.

జిల్లాకు 8,200 ఎపిక్ కార్డులు

ఇటీవల ఓటరు గుర్తింపు కార్డులో తప్పులు ఉన్న పలువురు జిల్లా ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తప్పులు సరి చేసి కొత్తగా ప్లాస్టిక్ ఓటరు కార్డులను పంపారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్‌కు చేరిన కార్డులను ఓటర్లకు పోస్టు ద్వారా పంపారు. వాటిని స్కాన్ చేసి అప్‌లోడ్ చేశారు. జిల్లాకు సుమారు 8,200 కార్డులు వచ్చినట్లు ఎన్నికల అధికారి మైనుద్దీన్ పేర్కొన్నారు.

ప్రస్తుతం జిల్లాలో ఓటర్లు ఇలా...

ప్రస్తుతం జిల్లాలో 13,41,077 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 6,72,887 మంది పురుష ఓటర్లు కాగా, 6,68,125 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 65 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారు. మహిళా ఓటర్లతో పోలిస్తే పురుష ఓటర్లు 4,762 మంది అధికంగా ఉన్నారు.

షెడ్యూల్ ఇలా...

ఈ నెల నుంచి 2024 జనవరి 5వ తేదీ వరకూ జిల్లా ఎన్నికల అధికారులు ప్రతి ఇంటినీ జల్లెడ పడతారు. డబుల్ రోల్, ఇతర సమస్యలుంటే పరిష్కరిస్తారు.

- జూలై 27వ తేదీ వరకూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, మార్గదర్శకాలపై బీఎల్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇందులో ఐటీ అప్లికేషన్లు, ఎలక్షన్ రివిజన్ మార్గదర్శకాలపై శిక్షణ ఇవ్వనున్నారు.
- జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ నెల రోజుల పాటు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, దరఖాస్తుల స్వీకరిస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకూ పోలింగ్ స్టేషన్ల క్రమ బద్ధీకరణ, ఎపిక్ కార్డులు, ఎలక్టోరల్ రోల్ నంబర్ల మధ్య వ్యత్యాసాన్ని సరిచేయడం, ఓటర్ల తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పోలింగ్ స్టేషన్‌ల సరిహద్దులు గుర్తించడం, లోకేషన్లు మార్పుపై వచ్చిన ప్రతిపాదనలను పరిష్కరిస్తారు.
- సెప్టెంబర్ 30వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకూ ఫార్మాట్-1 నుంచి ఫార్మాట్ -8 వరకు జాబితాలు తయారు చేస్తారు.
- అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తారు. అదే రోజు నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ అభ్యంతరాలు, క్లెయిములు స్వీకరిస్తారు.
- డిసెంబర్ 26వ తేదీ నాటికి అభ్యంతరాలన్నీ పరిష్కరిస్తారు.
- 2024 జనవరి 1వ తేదీ నాటికి ఓటరు తుది జాబితా రూపొందిస్తారు. 2024 జనవరి 5వ తేదీన జిల్లా ఓటరు తుది జాబితాను ప్రచురిస్తారు.

ప్రైవేటు టీచర్ వడ్డీ'పాఠం'

- వడ్డీ ఆశ చూపి మహిళలతో రూ.20 లక్షల అప్పు
- ఏడాదిన్నరగా తప్పించుకుని తిరుగుతున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత మహిళలు



గండికోట చంద్రశేఖర్‌ను విచారిస్తున్న ఎస్‌ఐ గోపీ

ఓడీ చెరువు: వారంతా కూలి పనులు చేసుకునే మహిళలు. కొందరు వ్యవసాయ పనులు చేస్తే.. మరికొందరు పూలు కట్టేవారు...ఇంకొందరు బీడీలు చుడతారు. వచ్చిన కొద్దిపాటి సంపాదనలో పైసాపైసా కూడబెట్టి భవిష్యత్‌కోసం దాచుకున్నారు. ఇలాంటి వాళ్లను ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు టార్గెట్ చేశాడు. వడ్డీ ఆశ చూపి వారి నుంచి డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఏడాదిన్నరగా అతను ముఖం చాటేయడంతో బాధిత మహిళలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని కొండకమర్లకు చెందిన గండికోట చంద్రశేఖర్ కొండకమర్లలో ఫైనాన్స్ నడపడంతో పాటు ఓడీ చెరువులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా కూడా పని చేస్తున్నాడు. తానుంటున్న వీధిలోని పలువురు మహిళలకు వడ్డీ ఆశ చూపి ఒకొక్కరి నుంచి రూ. 30 వేలు నుంచి రూ. 3 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ప్రతి నెల నూటికి రూ.2 చొప్పున వడ్డీ ఇస్తానని చెప్పాడు. కొన్నాళ్లు క్రమం తప్పకుండా వడ్డీ సొమ్ము ఇస్తుండటంతో వీధిలోని మిగతా మహిళలూ అతన్ని నమ్మి అప్పులు ఇచ్చారు. ఇలా సుమారు రూ. 20 లక్షల వరకు మహిళలతో అప్పుగా తీసుకున్న గండికోట చంద్రశేఖర్... ఆడబ్బును ఇతరులకు ఫైనాన్స్ ఇస్తూ అధిక వడ్డీ పొందుతున్నాడు. అయితే రెండేళ్లుగా మహిళలకు వడ్డీ ఇవ్వడం మానేశాడు. ఏడాదిన్నరగా మహిళల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అప్పు చెల్లించాలని గట్టిగా నిలదీసిన మహిళలకు లాయర్ ద్వారా నోటీసులు ఇప్పించాడు. దీంతో మోసపోయామని గ్రహించిన మహిళలు మంగళవారం స్థానిక పోలీసుల వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో ఎస్‌ఐ గోపి గండికోట చంద్రశేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఫిర్యాదు చేసిన 10 మంది మహిళల నుంచి రూ. 11,53,000 అప్పుగా తీసుకున్న మాట వాస్తవమేనని అతను అంగీకరించాడు. అలాగే పలువురు మహిళల నుంచి అప్పుగా మరికొంత మొత్తం తీసుకున్నట్లు తెలిపాడు. దీంతో ఎస్‌ఐ పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. అలాగే గండికోట చంద్రశేఖర్‌కు గడువు ఇచ్చి అప్పులన్నీ తీర్చాలని సూచించినట్లు తెలుస్తోంది.

పిల్లల చదువుకు ఆర్థిక భరోసా

- నేడు 'జగనన్న అమ్మఒడి' నాలుగో విడత నిధులు
- జిల్లాలోని 1,60,397 మందికి లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.208.51 కోట్లు
- బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగులు

ప్రశాంతి నిలయం: ఆర్థిక ఇబ్బందులతో ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. 'నాడు- నేడు' కింద రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ స్కూళ్లలో సకల సౌకర్యాలు కల్పించారు. మెరుగైన బోధనతో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాల్లో ఏటా రూ.15 వేలు అందించేలా 'జగనన్న అమ్మఒడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2020 జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా, వరుసగా మూడేళ్లు నిరాటంకంగా అమలు చేశారు. తాజాగా నాల్గో ఏడాది 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం సభలో బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలల్లో పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయిస్తారు. తక్కిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. పథకం అమలులో పారదర్శకతకు పెద్దపీట వేసిన ప్రభుత్వం ఇప్పటికే సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించింది. అలాగే 'అమ్మఒడి' పథకంలో లోటు పాట్లను తెలుసుకునేందుకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలను సైతం నిర్వహించి వారి నుంచి అభిప్రాయాలను సైతం సేకరించింది.



1,60,397 మందికి లబ్ధి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి 'జగనన్న అమ్మఒడి' లబ్ధిదారులను గుర్తించారు. వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేందుకు వీలుగా బయోమెట్రిక్ అథెంటికేషన్ కూడా పూర్తి చేశారు. ఈ ఏడాది 1,60,397 మంది తల్లులు అమ్మఒడికి అర్హత సాధించగా, వీరందరి ఖాతాల్లో రూ.13 వేల చొప్పున రూ.208.51 కోట్లు జమ కానుంది.


అర్హులందరికీ అమ్మఒడి



జిల్లాలో అర్హులైన ప్రతి తల్లి ఖాతాకు 'జగనన్న అమ్మఒడి' నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. అర్హుత ఉండి లబ్ధి చేకూరకపోతే విచారించి పథకం అందేలా చర్యలు తీసుకుంటాం. అమ్మఒడి నిధులను తల్లిదండ్రులు పిల్లల చదువులకు వినియోగించాలి.

– రంగస్వామి, ఇన్‌చార్జ్ డీఈఓ

మైమరపించిన 'సత్యసాయి దివ్య కథ'



సంగీత విభావరి నిర్వహిస్తున్న అమెరికా భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ భక్తులు సత్యసాయి దివ్య కథ పేరుతో నిర్వహించిన సంగీత విభావరి భక్తులను మైమరపింపజేసింది. అమెరికాకు చెందిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-1కు చెందిన భక్తులు మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత విభావరి నిర్వహించారు. దేవన్ సోదరులుగా పేరుగాంచిన కరణ్ కృష్ణ, శివ్ దేవన్ సంగీత బృందంతో కలిసి సత్యసాయిని కీర్తిస్తూ ఆలపించిన గీతాలతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం సంగీత కళాకారులను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి ఆషాఢ ఏకాదశి వేడుకలు

ప్రశాంతి నిలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆషాఢ ఏకాదశి పర్వదిన వేడుకలు జరగనున్నాయి. మహరాష్ట్ర, గోవాకు చెందిన 1,500 మంది భక్తులు వేడుకల్లో పాల్గొననున్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిత

- జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఎస్పీ మాధవరెడ్డి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (చిత్రంలో) రాగే హరిత

ప్రశాంతి నిలయం: నైపుణ్యాలను పెంపొందించుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని యువతకు ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్కృతి విద్యాసంస్థల ఆడిటోరియం వేదికగా నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ మాధవరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ రాగే హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో అధిక శాతం యువతను కలిగి ఉండడంతో దేశం వేగంగా అభివృద్ధి చెందేందుకు చక్కటి అవకాశముందన్నారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి వ్యసనాలకు బానిస కాకూడదని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ వేదికలపై సత్తాచాటాలన్నారు. అనంతరం పంచప్రాన్ అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, సత్కరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో యువత ఆకట్టుకుంది. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, సంస్కృతీ విద్యాసంస్థల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి, జిల్లా యువజన సంక్షేమ అధికారి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, పతంజలి యోగా గురువు మహేష్ బాబు, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సుంకర రమేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముదిగుబ్బ: స్థానిక దొరిగిల్లు రోడ్డులో విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుబడింది. వివరాలను విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఏఈఈ రవీంద్రనాథ్, ఎస్ఐ శేషగిరి, రెవెన్యూ సిబ్బందితో కలసి సీఐ సాయిప్రసాద్ మంగళవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనంలో 284 బస్తాల్లో 163 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యంతో పాటు డ్రైవర్ వద్ద ఉన్న రూ.4,45,700 స్వాధీనం చేసుకున్నారు. బియ్య తరలిస్తున్న పాల్తే రమేష్ నాయక్, దేగల వేణుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

THE ANANTAPUR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD., ANANTAPUR.

BALANCE SHEET

Amount in Rupees

Description	Sch	As on 31-03-2023 (Current Year)	As on 31-03-2022 (Previous Year)
Capital and Libilities			
Capital	1	1,14,72,26,068.87	1,04,50,67,107.87
Reserves and Surplus	2	1,28,83,37,629.91	1,28,49,38,666.77
Deposits	3	5,22,47,22,945.60	5,28,35,66,590.86
Borrowings	4	8,25,53,16,678.80	6,88,22,98,376.80
Other Liabilities and Provisions	5	1,30,31,33,209.11	1,43,70,97,829.93
Total		**17,21,87,36,532.29**	**15,93,29,68,572.23**
Assets			
Cash and balances with Reserve Bank of India	6	11,49,30,122.00	7,55,75,672.00
Balance with banks and money at call and short notice	7	2,70,02,90,731.90	3,24,01,47,057.39
Investments	8	1,71,78,83,322.04	1,63,79,14,094.84
Advances	9	11,05,16,84,317.44	9,22,86,16,215.82
Fixed Assets	10	1,23,77,37,451.39	1,24,08,97,297.18
Other Assets	11	39,62,10,587.52	50,98,18,235.00
Total		**17,21,87,36,532.29**	**15,93,29,68,572.23**
Contingent Liabilities (DEAF)	12	67,20,454.20	20,11,087.20

* Significant Accounting Policies & Notes to Accounting annexed

* The scheduled referred to above from an Integrappart of the Balance Sheet, asper our attached report of even date.

Note : Previous Year figures are regroups/reclassified where ever necessary to suit current year layout.

PROFIT & LOSS

Amount in Rupees

Description	Sch	As on 31-03-2023 (Current Year)	As on 31-03-2022 (Previous Year)
Income			
Interest earned	13	77,44,17,578.10	81,75,50,561.50
Other income	14	16,82,02,720.60	4,98,41,999.58
Total		**94,26,20,298.70**	**86,73,92,561.08**
Expenditure			
Interest expended	15	64,05,54,524.70	50,68,85,019.83
Operating expenses	16	29,16,40,293.59	34,88,98,553.65
Provisions and contingencies			
Total		**93,21,94,818.29**	**85,57,83,573.48**
Profit / Loss		1,04,25,480.41	1,16,08,987.60
Net profit / loss (-) for the year After Tax			
"Profit / loss (-) brought forward"			
Total		**1,04,25,480.41**	**1,16,08,987.60**
Appropriations			
Reserve Fund		52,12,740.00	58,04,493.80
Dividend Equilisation Fund		15,63,822.00	
Investment Fluxation fund		26,97,940.41	
Agrl., Stabilisation Fund		76,493.00	74,265.00
Education Fund		2,00,000.00	2,00,000.00
Building Fund		6,74,485.00	11,06,045.76
Common Good Fund			5,53,022.88
Other Reserves			38,71,160.16

NOTES ON ACCOUNTS

i) SLR in Govt Sec - Rs.13603.21 lakhs (HTM)
ii) Non SLR Investments - Rs.3555.82 lakhs
iii) No loans had been issued to Directors
iv) No Bank Guarantees as on 31-03-2023
v) Average Cost of Deposits - 4.92%
vi) NPAs a) Gross NPAs - Rs. 6778.33 Lakhs (6.13%)
b) Net NPA - Rs. 517.30 Lakhs (0.50%)
vii) Provision for NPAs - 4440.23 Lakhs
viii) Provision for Standard Assets - 309.62 Lakhs
ix) Insurance premium to DICGC had been paid - 65.30 Lakh

For AM Reddy & DR Reddy Chartered Accounts

FRN: 009068S

Sd/- CA R.Rama Ravisankar Reddy M.No.217160

For The Anantapur District Cooperative Central Bank Ltd.,

Sd/- A.B Ramprasad CEO

దోచుడు.. దాచుడే మీ విధానం

- గొందిరెడ్డిపల్లి గుట్టకు గుండు మీ పనే
- 25 ఏళ్లలో ఏమి ఒరగబెట్టారు?
- అది బస్సు యాత్ర కాదు.. తుస్సు యాత్ర
- పరిటాల సునీతపై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో పైలా నరసింహయ్య

రాప్తాడురూరల్: పరిటాల కుటుంబానిది దోపిడీ విధానమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. దోచుకోవడం.. దాచుకోవడం తప్ప వారికి ప్రజల సమస్యలు పట్టవన్నారు. పాతికేళ్లలో ఏమి ఒరగబెట్టారో తెలిపి.. మళ్లీ వస్తే ఏమి చేస్తారో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి పరిటాల సునీతకు హితవు పలికారు. మంగళవారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు పొందడానికి అవసరమైన సర్టిఫికెట్లు లేక ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి 11 రకాల సేవలను సేవా రుసుము లేకుండా ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష పేరుతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. జూలై 1 నుంచి 30 వరకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామఅధికారులు, ప్రజాప్రతినిధులు క్యాంపులు నిర్వహించి, ప్రజలకు అక్కడికక్కడే టోకెన్ల వారీగా పిలిపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

దోపిడీకి అంబాసిడర్ సునీత

దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్ మహానటి పరిటాల సునీత అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. మీ తమ్ముళ్లకు చెరువులు, కొండలు అప్పగించారన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ చేసిన రైల్వే పనుల కోసం జంగాలపల్లి చెరువు మొత్తం గుంతలు పెట్టారన్నారు. గొందిరెడ్డిపల్లి గుట్టకు గుండు చేసింది నీవే తల్లీ అని అన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ నడుపుతున్న నీ కొడుకులు ఇక్కడి నుంచి మట్టిని తీసుకుపోయి రూ.80 కోట్లకు బిల్లులు పెట్టుకున్నారని ఆరోపించారు. ఆలమూరు కొండను మరో తమ్ముడికి అప్పగించావన్నారు. మీరు చేసిన దోపిడీని ప్రజలు మరిచిపోలేదన్నారు.

సంపదను పంచడం మా విధానం

సంపదను సృష్టించి.. ప్రజలకు పంచడం తమ విధాన మని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు నిదర్శనమే 'అమ్మ డెయిరీ' అని పేర్కొన్నారు. తమ చిత్తశుద్ధిని శంకించాలని చూస్తే భగవంతుడే మీకు శిక్ష వేస్తాడన్నారు. తమది నిస్వార్థ ప్రజాసేవ అన్నారు.

బస్సుకు డీజిల్ వేయించుకోండి

బస్సు యాత్రలో భాగంగా పేరూరుకు వెళ్లినప్పుడు వీధిలైట్లు వెలగలేదని, తానే వేయిస్తానని అంటున్న పరిటాల సునీత.. ముందు మీ బస్సుకు డీజిల్ వేయించుకుని యాత్ర చేపట్టండి అంటూ ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అది బస్సు యాత్ర కాదని.. తుస్సు యాత్ర అని అన్నారు. తనపై అసందర్భ ప్రేలాపనలు సరికాదన్నారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దొంగలు, ఉపాధి హామీ దొంగలు, నీరు-చెట్టు దొంగలు, ప్రాజెక్టుల దొంగలు మీరేనని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించారని, మాజీ సైనికుల పేరుతో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ధ్వజమెత్తారు.

సామూహిక వివాహాలకు భారీగా వసూలు

ఎంతోమంది అమాయకుల తాళిబొట్లు తెంపిన కుటుంబం మీది అని పరిటాల సునీతపై ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. పెళ్లిళ్లు చేయాలంటూ ఎవరూ మీవద్దకు రాలేదన్నారు. హైదరాబాద్ నుంచి జూనియర్ ఆర్టిస్టులను పిలిపించి పెళ్లిళ్లు చేసినట్లు డ్రామా చేశారన్నారు. ఇందుకోసం ధర్మవరం, ఇతర ప్రాంతాల్లో భారీగా డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో పరిటాల సునీత హైదరాబాద్‌లో కూర్చుని జూమ్ కాన్ఫరెన్స్‌లు పెడితే, తాము మాత్రం ప్రజలతోనే ఉన్నామని చెప్పారు. వారికి అండగా నిలబడి దాదాపు రూ.4 కోట్లు ఖర్చు పెట్టి సహాయక కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2022లో గడువు ముగిసిన తన స్టిక్కర్‌ను జిరాక్స్ చేయించుకుని జులాయిలు తమ వాహనానికి అతికించుకుని తిరిగితే తనకేం సంబంధమని ప్రశ్నించారు. పరిటాల రవి కార్మిక మంత్రిగా ఉన్నప్పుడే రామగిరి బంగారు గనులు మూసేశారన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బస్సు యాత్ర ఫ్లాప్ ఫ్రస్ట్రేషన్‌తోనే..

బస్సు యాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో టీడీపీ నాయకులు ఫ్రస్ట్రేషన్‌తో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల వ్యక్తిత్వహననానికి దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. 600 హామీలతో అధికారం చేపట్టి ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఓట్ల కోసం మరోమారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 'అమ్మ' డెయిరీ ఏర్పాటును జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, బీసీ సెల్ నేత ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ రాప్తాడు మండల కన్వీనర్ జూటూరు శేఖర్, కక్కలపల్లి కాలనీ ఎంపీటీసీ సభ్యుడు వడ్డే శీనా పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ఎదగాలి

- ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


సంగీత పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, తదితరులు

హిందూపురం: శుభ, అశుభ కార్యాక్రమాలను ముందుండి నడిపించే నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ఎదగాలని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆకాంక్షించారు. హిందూపురంలోని త్యాగరాజనగర్‌లో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంగీత పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలసి వారు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. ఆధునిక వైద్యం అందుబాటులో లేని రోజుల్లో ఎన్నో రకాల జబ్బులకు నాయీ బ్రాహ్మణులే చికిత్స చేసే వారని గుర్తు చేశారు. విద్య, వైద్య, ఆర్థిక తదితర రంగాల్లో అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతున్న కులాలను గుర్తించి, ఆయా కులాల ఎదుగుదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. సంగీత పాఠశాల నిర్మాణానికి తన కోటా నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పాటు భవిష్యత్తులో మరో రూ.5 లక్షలు అందించేందుకు కృషి చేస్తానని ఎంపీ మాధవ్ భరోసా నిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, కౌన్సిలర్ నాగేంద్రబాబు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు లోకేష్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు నాగరాజు, మూర్తి, గోపి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నీట మునిగి విద్యార్థి మృతి


ఉజ్వల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

పావగడ: స్థానిక షిర్డి సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న చాకలి కుంట(చెరువు)లో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిరకు చెందిన రమేష్ కుటుంబసభ్యులతో కలసి పావగడలోని చాకలికుంట వద్ద అద్దె ఇంట్లో నివాసముంటూ గృహ నిర్మాణాలకు ఇటుకలు, రాళ్లు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు ఉజ్వల్ (13) అనంతపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇంటి వద్దనే ఉంటున్న ఉజ్వల్ మంగళవారం ఉదయం 11 గంటలకు తన స్నేహితులతో కలసి చాకలికుంట వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడ్డాడు. లోతుగా ఎక్కువగా ఉండడంతో నీట మునిగాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని దాదాపు రెండు గంటల పాటు శ్రమించి బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై ఎస్ఐ గురుమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడికి కత్తిపోట్లు


తీవ్రంగా గాయపడిన జావీద్

కదిరి టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన కదిరిలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరిలోని కంచుకోటకు చెందిన జావీద్ అక్కను అదే ప్రాంతానికి చెందిన అలీ పెళ్లి చేసుకున్నాడు. కుటుంబంలో మనస్పర్థలు చెలరేగడంతో అలీ దంపతులు విడిపోయారు. దీంతో అలీపై జావీద్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి టీస్టాల్ వద్ద తన స్నేహితులతో కలసి జావీద్ ఉన్నప్పుడు అక్కడే ఉన్న అలీ ద్విచక్ర వాహనాన్ని గుర్తించి కిందకు తోసేశారు. దీంతో వారి చర్యలను అలీ నిలదీశాడు. ఆ సమయంలో మాటామాట పెరిగి పరస్పర దాడులకు సిద్ధపడ్డారు. సమాచారం అందుకున్న అలీ తమ్ముడు బాబా, కుటుంబ సభ్యులు అక్కడు చేరుకోవడంతో ఘర్షణ తీవ్ర స్థాయికి చేరుకుంది. జావీద్ గొంతుపై కత్తితో బాబా దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలీ తలకు, బాబాకు చేతికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జావీద్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పరస్పర ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు మహబూబ్‌పీరా

పుట్టపర్తి టౌన్: కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువులోని ఆర్టీటీ కాలనీకి చెందిన మహబూబ్‌పీరా (32), చాందిని దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గాలి బంక్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న మహబూబ్‌పీరా సోమవారం రాత్రి నొప్పి తీవ్రత భరించలేక ఇంట్లో భార్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వేకువజామున నిద్రలేచిన భార్య ఈ విషయాన్ని గుర్తించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ లింగన్న మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చిన్నారులకు విద్యుత్ షాక్

కనగానపల్లి: మండలంలోని బాలేపాళ్యంలో ఇద్దరు చిన్నారులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇళ్ల మీద విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఈ తీగలు కొన్నిచోట్ల ఇళ్లకు తాకుతుండటంతో మంగళవారం సాయంత్రం మిద్దెల పైకి ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు హేమంత్‌రెడ్డి, బాబురెడ్డి షాక్ గురై కింద పడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారులను వెంటనే అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఇళ్లపై వెళుతున్న తీగలు మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా గ్రామస్తులు చిన్న పెద్దిరెడ్డి, రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేకపోతే ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సిమెంట్ వివరాలు 'సమగ్ర'ంగా ఇవ్వాలి

- ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన డీఈతో వన్‌టౌన్ సీఐ
- 'లాగిన్' బ్లాక్ చేయడంతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- కంపెనీ నుంచి వివరాలు తెచ్చుకోక పోవడంపై అనుమానాలు
- వివరాల కోసం అల్ట్రాటెక్ కంపెనీకి నేడు వెళ్లనున్న అధికారులు

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయంలో జరిగిన సిమెంట్ స్కాంపై వివరాలు సమగ్రంగా ఇవ్వాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు. అరకొర వివరాలతో ఫిర్యాదు చేసేందుకు డీఈ వెళ్లడంతో పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారు. వాస్తవానికి సమగ్రశిక్ష ఈఈ శివకుమార్ ఫిర్యాదు చేసేందుకు వెళ్లాల్సి ఉంది. అయితే ఆయన కర్నూలులో మంత్రి కార్యక్రమంలో ఉండడంతో సత్యసాయి జిల్లా డీఈ చితంబరంకు నోట్ ఆర్డర్ ఇచ్చారు. దీంతో డీఈ మంగళవారం సాయంత్రం సీఐ రెడ్డప్పను కలిశారు. ఫిర్యాదులో వివరాలు సమగ్రంగా లేకపోవడంతో పూర్తి వివరాలు ఇవ్వాలని సీఐ కోరారు. 'ఏ తేదీన బుక్ చేశారు...ఏ కాంట్రాక్టర్ పేరు మీద బుక్ చేశారు...ఏ బ్యాంకులో ఎవరి అకౌంట్‌ద్వారా డబ్బులు చెల్లించారు...సదరు కంపెనీ నుంచి సిమెంటు లోడు ఎప్పుడు బయలుదేరింది...ఎక్కడికి వెళ్లింది' తదితర వివరాలేమీ లేకపోతే దర్యాప్తునకు ఇబ్బందిగా ఉంటుందని సీఐ పేర్కొన్నారు. చేసేదేమీలేక డీఈ వెనక్కు తిరిగొచ్చారు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

అక్రమాల వ్యవహారంపై అనేక అనుమానాలు..

శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణాలకు సబ్సిడీ సిమెంట్ కోసం ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్ల మీద బుక్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా విడిపోయిన తర్వాత డీఈ, ఈఈల పేర్లతో వచ్చిన కొత్త లాగిన్లను ఆ జిల్లాకు పంపకుండా అనంతపురం ఈఈ కార్యాలయంలోనే ఇద్దరు ఉద్యోగులు లాగిన్ అయ్యారు. ఆ సమయంలో వచ్చే ఓటీపీల కోసం ఆ ఇద్దరి ఉద్యోగుల ఫోన్ నంబర్లు నమోదు చేశారు. అంతే అప్పటి నుంచి కాంట్రాక్టర్ల పేర్లతో సిమెంట్ బుక్ చేయడం..వచ్చిన సిమెంట్ లోడ్లను బయట మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటూ వచ్చారు. అయితే ఇతరుల ప్రమేయం లేకుండా కేవలం ఆ ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇంత వ్యవహారం నడిపింటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొందరి సైట్ ఇంజినీర్ల పాత్రలపై ప్రచారం సాగుతోంది.

డీఈ నంబరు ఎలా వచ్చింది?

మొత్తం సిమెంట్ అల్ట్రాటెక్ కంపెనీ నుంచే వచ్చింది. ఇండెంట్ పెట్టిన సమయంలో ఆ ఇద్దరు ఉద్యోగుల ఫోన్ నంబర్లు ఉన్నాయి. అయితే ఒక డీఈ ఉపయోగించే ఫోన్ నంబరుపై కూడా దాదాపు 12 లోడ్లు బుక్ చేశారు. డీఈ నంబరు ఎలా వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు రెండు వారాల కిందటే సిమెంట్ స్కాం విషయాన్ని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. అయితే బయటకు పొక్కకుండా గోప్యత పాటిస్తూ విచారణ చేస్తూ వచ్చారు.

వివరాలు తెచ్చుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో?

వ్యవహారం బయటకు పొక్కడంతో ఇన్ని రోజులుగా దొంగచాటున వినియోగించిన డీఈ, ఈఈ లాగిన్లను బ్లాక్ చేశారు. వివరాలు కావాలంటే ఆ లాగిన్లనే చూడాలి. లేదంటే సిమెంట్ పంపిన కంపెనీ వద్ద సమగ్రంగా వివరాలు ఉంటాయి. కానీ కంపెనీ నుంచి ఆ వివరాలు తెప్పించుకునే ప్రయత్నం ఇప్పటిదాకా చేయలేదు. దీని వెనుక ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. లాగిన్లను బ్లాక్ చేసినట్లు గుర్తించిన వెంటనే అల్ట్రాటెక్ కంపెనీకి వెళ్లి ఉంటే మొత్తం బండారం బయటకు వచ్చేది. వివరాలు లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు లేకపోవడంతో వారు కేసు నమోదు చేయలేదు. కాగా బుధవారం అల్ట్రాటెక్ కంపెనీకి వెళ్లి పూర్తి వివరాలు తెచ్చుకునే ఆలోచనలో ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యే కేతిరెడ్డితో కలసి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ త్రివేణి

బత్తలపల్లి: గామాల అభివృద్ధే జగన్ సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని డి.చెర్లోపల్లిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.17.67 లక్షలతో జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇంత అభివృద్ధి పనులు జరుగుతున్నా ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, సర్పంచ్ గుజ్జల రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఏఓ ఓబిరెడ్డి, ఎంఈఓ సుధాకర్‌నాయక్, వైద్యాధికారి గంగిరెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో భద్రత పెంచాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ప్రమాణాలు మరింత పెంచాలని అధికారులు, ఎయిపోర్టు నిర్వాహకులకు కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. పుట్టపర్తిలోని విమానాశ్రయంలో మంగళవారం ఎయిర్‌పోర్టు భద్రత కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ. విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏఏ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయం నిర్వాహకుల మధ్య పరస్పర సహకారం ఉండాలని, సమాచార బదిలీతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ప్రమాణాలు పెంచాలని సూచించారు. విమానాశ్రయాన్ని కమర్షియల్ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అనంతరం విమానాశ్రయం సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీలు వాసుదేవన్, విజయకుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐ సుబ్బారావు, తహసీల్దార్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.